# విపశ్యన మాసపత్రిక

VOLUME:41 NO - 32 1 November, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

## "ధర్మవాణి"

*న తావతా ధమ్మధరో యావతా బహు భాసతి !*
*యో చ అప్పం పి సుత్వాన ధమ్మం కాయేన పస్సతి !!*
*స వే ధమ్మధరో హోతి యో ధమ్మం నప్పమజ్జతి*

*– ధమ్మపదం – 259*

ఎక్కువగా ధర్మశాస్త్రాలు ఉపోసనపట్టి వల్లెవేసినంత మాత్రాన ఎవడూ ధర్మవంతుడు కాజాలడు. కొద్దిమాత్రమే అయినా, ధర్మం గురించి విని, దాన్ని ఉపేక్షించక స్వీయానుభూతికి తెచ్చుకొని ఆచరించువాడే నిజమైన ధర్మవంతుడు

## పూజ్య గురూజీ భారతదేశానికి వచ్చిన తరువాత ఎదురైన అనుభవాలు

పూజ్య గురూజీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధధర్మ సంపర్కంలోకి రావటం నుండి మొదలుకుని వారి ప్రారంభిక జీవితానికి సంబంధించిన అనేక వ్యాసాలు ముద్రింపబడ్డాయి. ఆయన భారతదేశానికి వచ్చి, విపశ్యన బోధన ప్రారంభించిన తరువాత ఎదుర్కొన్న అనుభవాలు మరియు ఆయన బోధించిన శిక్షణను ఇప్పుడు ప్రకాశింపచేస్తున్నాము. ఈ క్రమంలోనే – గోయంకా గారు రచించిన హిందీ పుస్తకం **ఆత్మకథన్ భాగ్ 2** యొక్క **పదహారవ భాగాన్ని** సమర్పిస్తున్నాము.

### భారతదేశం పట్ల తీర్చుకోవాల్సిన ఋణం

గురుదేవులు సయాజీ ఊ బా ఖిన్ గారు, "భారతదేశం యొక్క ఋణాన్ని తిరిగి చెల్లించాలి. భారతదేశం మనకు అమూల్యమైన విపశ్యన ఇచ్చింది. ఈ క్షేత్రంలో మన మీద దాని ఋణం ఎంతగానో ఉంది. ఇప్పుడైతే అక్కడ విపశ్యన అనే పదమే మాయమైపోయింది. అందుకే స్వయంగా నేనే వెళ్లి అక్కడి ప్రజలకు ఈ విద్యను నేర్పించాలి." అని ఆయన పదే పదే అంటుండేవారు.

నేను గురుదేవుని మొదటిసారి కలిసినప్పుడు ఆయన, "నేను నీకు భారతదేశపు అత్యుత్తమ విద్యను నేర్పిస్తాను. దాని పేరు విపశ్యన." అని చెప్పారు. నేను ఇంటికి వచ్చి హిందీ, సంస్కృత భాషల నిఘంటువులు వెదికితే వాటిలో విపశ్యన అనే పదమే లేదు. నిజంగానే భారతదేశం ఎంతగానో నష్టపోయింది. కాబట్టే ఈ ఋణాన్ని స్వయంగా ఆయనే వెళ్లి తిరిగి చెల్లించుకోవాలనుకున్నాడు. "ఈ పని మరెవరు చేస్తారు? స్వయంగా నేనే చేస్తాను." అని ఆయన అంటుండేవారు. కానీ బర్మా ప్రభుత్వం ఆయనకు పాస్‌పోర్టు ఇవ్వలేదు.

ఆ రోజుల్లో కేవలం రెండే షరతులపై పాస్‌పోర్టు ఇవ్వబడేది. మొదటిది – ఎవరయినా వ్యక్తి శాశ్వతంగా దేశాన్ని వదిలి వెళ్లిపోతుంటే లేదా రెండవది విదేశంలో ఏదైనా ఉద్యోగం వచ్చినా పాస్‌పోర్టు ఇచ్చేవారు. గురుదేవులు ఉద్యోగం చేయానుకునేవారు కాదు. కాబట్టి ఆ నెపంతో పాస్‌పోర్టు తీసుకోలేరు. అలాగే ఆయన బర్మాను శాశ్వతంగా వదిలివెళ్ళే ఇష్టం లేదు. కాబట్టే ఆయన భారతదేశానికి రాలేకపోయారు.

కొద్దికాలం తరువాత భారతదేశానికి వచ్చి కొంతకాలంగా ఇతర కుటుంబసభ్యులతో నివసిస్తున్న మా అమ్మగారు అస్వస్థతకు గురయ్యారని విన్నాను. మయన్మార్ ప్రభుత్వం అక్కడ నివసిస్తుండే భారతీయులను ఇబ్బందికి గురిచేస్తోంది అని ఆమె విన్నది. దానితో తన సంతానం పట్ల ఆమె బెంగపెట్టుకున్నది. సాధన చేస్తే అమ్మ ఆరోగ్యం కుదుటపడుతుంది అని నాకు తెలుసు. కాబట్టే భారతదేశానికి వెళ్లి ఆమెకు నేనే విపశ్యన నేర్పించాలి అని అనుకున్నాను. మరుసటిరోజు నేను పాస్‌పోర్టు కొరకు అభ్యర్థించాను. యాదృచ్ఛికంగా నా మిత్రుల్లో ఒకరైన శ్రీ ఊ ర్తి హా అప్పటి విదేశాంగ శాఖ మంత్రిగా ఉండేవారు. ఆయన సహకారంతో నా పని సులభమైపోయింది. భారతదేశానికి వెళ్లటానికి నాకు పాస్‌పోర్టు లభించింది. అది తెలుసుకున్న పూజ్య గురుదేవులు ఎంతగానో సంతోషించారు. అలా నేను భారతదేశానికి వస్తుంటే, "భారతదేశం పట్ల ఉన్న ఋణాన్ని తీర్చవలసిన నా వంతు బాధ్యతను ఇప్పుడు నీవు చేపట్టబోతున్నావు." అని ఆయన అన్నారు. కాబట్టే ఆయన నన్ను విపశ్యన యొక్క అధికారిక ఆచార్యుడిగా నియమించి భారతదేశానికి పంపించారు.

ప్రసన్నచిత్తంతో నేను భారతదేశానికి వచ్చాను. నేనైతే నా తల్లిదండ్రులకు విపశ్యన నేర్పించాల్సి ఉన్నది. మరెవరైనా శిబిరంలో కూర్చుంటే కూర్చోవచ్చు.

నా కుటుంబ సభ్యులను మినహాయిస్తే నాకు భారతదేశంలో పరిచయస్తులు ఎవరూ లేరు. మహా అయితే కొందరు మిత్రులతో నాకు పరిచయం ఉండేది. అన్ని విధాలా అపరిచితమైన ఈ విశాల దేశంలో నేను విపశ్యన ఎలా నేర్పించగలను? ఒకవేళ శిబిరాన్ని నిర్వహించినా అందులో ఎవరు పాల్గొంటారు? శిబిరం ఎక్కడ నిర్వహించాలి? దానిని ఎవరు ఏర్పాటు చేస్తారు? ఆ ఖర్చులు ఎవరు భరిస్తారు? అనే ప్రశ్నలు నన్ను వ్యాకులపరుస్తుండేవి, నామీద నాకే అనుమానం కలిగేది. కానీ గురుదేవులైతే, "శిబిరం నీవు కాదు, నేను నిర్వహిస్తున్నాను. కాబట్టి ఏమాత్రం చింతించవద్దు." అనే హామీ ఇచ్చారు.

### భారతదేశంలో మొదటి శిబిరం

ఆయన చెప్పినది అక్షరసత్యమైంది. ఇన్ని అపనమ్మకాలతో భారతదేశానికి వచ్చిన తర్వాత, ఇక్కడ నివసిస్తుండే మయన్మార్‌లోని కొంతమంది నా పాత మిత్రులు నన్ను కలవటానికి వచ్చారు. వాళ్ళతో చర్చ జరిగినప్పుడు వారిలో ఒకరైన శ్రీ దయానంద్ అడుకియాగారు, "మీరు శిబిరం నిర్వహించండి, కావలసిన ఏర్పాట్లు నేను చేయిస్తాను." అని అన్నారు. ఇంతలో కొందరు మిత్రులు శిబిరంలో పాల్గొనటానికి

కూడా తయారయ్యారు. అలా పంచాయతీ వాడీ ధర్మశాలలో శిబిరం ఏర్పాటయింది. 03 జూలై 1969 రోజున మొదటి శిబిరం నిర్వహించబడింది. అందులో మా తల్లిదండ్రులు, మరికొందరు కుటుంబసభ్యులతో పాటు మరికొందరు పరిచయస్థులైన మిత్రులతో కలిసి మొత్తం 13 మంది పాల్గొన్నారు. వారి ద్వారా విషయం వ్యాపించటంతో రెండవ శిబిరాన్ని నిర్వహించాలనే ప్రస్తావన వచ్చింది. తరువాతి శిబిరం చెన్నై (మద్రాసు)లో నిర్వహించబడింది. అలాగే మూడవ శిబిరం మళ్లీ ముంబయిలో నిర్వహించబడింది. ఈ విధంగా అభ్యర్థన వస్తూపోయింది, ఒక శిబిరం తర్వాత మరొకటి ఏర్పాటవుతూపోయాయి.

సాహిత్యకారుడైన నా మిత్రుడు శ్రీ యశ్‌పాల్ జైన్, ఢిల్లీలో శిబిరాన్ని నిర్వహించాలని అభ్యర్థించారు. ఆయన బిర్లా మందిరంలో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే సారనాథ్‌లోని బిర్లా ధర్మశాలలో భిక్షు ధర్మరక్షితగారు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అందులో ప్రతాపగఢ్ (ఉత్తరప్రదేశ్) కి చెందిన శ్రీ జీతలాల్, తన కుటుంబ సభ్యులతో పాటుగా పాల్గొన్నారు. ఆయన, తన స్వగ్రామమైన ప్రతాపగఢ్ జిల్లాలోని మాధోగంజ్‌లో ఒక శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇలా ఒక మంచి ఆరంభం జరిగింది. అపరిచితులుగా అనిపించే వ్యక్తులు పరిచయస్తులుగా అగుపించారు. విపశ్యన శిబిరంలో పాల్గొన్న వారందరూ విపశ్యన పట్ల భక్తిభావన కలవారుగా అయ్యారు. అలా శిబిరాలకు డిమాండ్ పెరుగుతూపోయింది, ఉత్తర భారతదేశంలో సంచరిస్తూ శిబిరాలు నిర్వహించటం మొదలుపెట్టాను. యాత్రలకయ్యే ఖర్చును స్వయంగా నా కుటుంబసభ్యులే భరించేవారు. వారు నాకు మరియు యాదవ్‌కు (గోయంకా గారి సహాయకుడు) టికెట్లు కొనిచ్చి, వాటితో పాటుగా రూ. 200 లేదా రూ. 400 ఇచ్చేవారు. వాటితో నేను భోజనం చేసిన చోటల్లా రూ. 100 దానంగా ఇచ్చేవాడిని.

ఉత్తర భారతదేశంలో ఎన్నో శిబిరాలు నిర్వహించబడ్డాయి. ధర్మం యొక్క గొప్పతనం మరియు గురుదేవులు సయాజీ ఊ బా ఖిన్ గారి ఆశీస్సుల కారణంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ కలగలేదు. అలా ఒక శిబిరం తర్వాత మరొకటి నిర్వహించబడుతూపోయాయి, శిబిరాలకు డిమాండ్ పెరుగుతూపోయింది.

మా కుటుంబ సభ్యులందరూ విపశ్యన శిబిరాల ద్వారా ప్రయోజనం పొందారు. ముఖ్యంగా ఆనందమార్గ సాధనలో ఉన్న మా కుటుంబసభ్యుల్లో ఎంతో మార్పు కనిపించింది. విపశ్యన కారణంగా ఎంతో ప్రగతి సాధించారు. పెద్దన్నయ్య శ్రీ బాలకృష్ణ సాధన చేస్తూ చేస్తూ విపశ్యన ఆచార్యులయ్యారు; వారి ద్వారా దక్షిణ భారతదేశంలోని ఎంతో మందికి మేలు జరిగింది. ఆయన దక్షిణ భారతదేశంలోని విపశ్యన కేంద్రాల బాధ్యతను కూడా చేపట్టారు. అయితే ఆనందమార్గం పట్ల ఎంతో లోతైన అనుబంధం ఉన్న కారణంగా చిన్న తమ్ముడు శ్రీ శ్యాంసుందర్ ఇప్పటి వరకూ విపశ్యన ద్వారా ప్రయోజనం పొందలేకపోయారు.

కలకత్తాలో మొదటి శిబిరాన్ని నిర్వహించినప్పుడు తలెత్తిన దుస్సంఘటన. ఆ శిబిరంలో పాల్గొన్న ఒక యువకుడికి మతి స్థిమితం లేదు. ఆయన ఈ శిబిరంతో ఆరోగ్యవంతుడయ్యాడు. ఎంతో ప్రసన్నత చెందిన అతడి తల్లి, చివరిరోజున తన కొడుకుతో పాటుగా నాకు నమస్కరించటానికి వచ్చారు. తన అబ్బాయి ఎప్పటికీ ఆరోగ్యవంతుడై ధర్మంలో ముందుకు సాగేలా అతడికి ఆశీర్వాదం ఇవ్వమని ఆమె నన్ను వేడుకున్నది. నేను అతనితో "త్వరలోనే నిర్వాణం ప్రాప్తించాలి" అని అన్నాను. నేను అతనిని ఆశీర్వాదించటానికే నిర్వాణం ప్రాప్తించాలి అని అన్నాను. కానీ భారతదేశంలో నిర్వాణం అంటే మృత్యువుకు పర్యాయపదం అయిపోయిన కారణంగా ఆమె ఎంతో నొచ్చుకుంది. నేను "ఈ సాధనతో బ్రతికి ఉండగానే నిర్వాణపు అనుభూతి కలుగుతుంది. ఏ వ్యక్తి అయినా నిర్వాణిక స్థితిని ప్రాప్తించుకుని తిరిగి దైనిక జీవితపు పనులన్నీ చేసుకోగలడు." అని వారికి ఎంతగానో నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. కానీ వారు అర్థం చేసుకోవటానికి సిద్ధంగా లేరు.

మరొక సంఘటన. ఒకానొక శిబిరంలో నా దాయాదుడైన శ్రీ చౌథామల్ యొక్క మిత్రుడు ఒకతను పాల్గొన్నాడు. అతడు ఉత్తరప్రదేశ్‌లో ఒక ప్రసిద్ధ వైద్యుడు. ఆయన ఎంతో బాగా సాధన చేసుకుంటూ ఉన్నాడు. మూడవరోజు విపశ్యన నేర్పించిన తరువాత శరీరమంతటా సంవేదనల అనుభూతి కలిగింది. అయితే, "నీకు పొట్టలో ఏవైనా వేదనలు అనుభూతిలోకి వచ్చాయా?" అని నేను అడిగినప్పుడు, నేనేదో వ్యర్థపు మాటలు మాట్లాడుతున్నట్లుగా ఆయనకు అనిపించింది. ఇక్కడ కేవలం నొప్పులనే వేదన అని పిలుస్తున్నారు. మరి నొప్పులేవీ లేని చోట వేదన అని ఎలా అనగలము? ఆయన అదేరోజు శిబిరాన్ని వదిలి వెళ్ళిపోయాడు. అప్పటి నుండి నేను వేదనకు బదులుగా సంవేదన అనే పదాన్ని ఉపయోగించటం మొదలుపెట్టాను. శిబిరాల నిర్వహణలో భాష పరమైన అడ్డంకులు తొలగిపోవటం మొదలయింది. ఈ రకమైన సంఘటనలు అప్పుడప్పుడూ ఎదురయినప్పటికీ, శిబిరాలు ఎంతో చక్కగా నడపబడ్డాయి, పాల్గొన్న సాధకులందరూ ప్రసన్నతతో తిరిగి వెళ్ళారు.

అదే విధంగా భారతదేశానికి చెందిన హిందీ శిబిరాల్లో, ప్రత్యేకించి బోధగయాలో నిర్వహించిన శిబిరాల్లో హిప్పీ తరహా వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేవారు. ఆ రోజుల్లో ఇంగ్లీషు భాష పట్ల నాకు ఉన్న జ్ఞానం ఎంతో సాధారణమైనది. నా వ్యాపార కార్యకలాపాల్లో ఉపయోగపడేంత ఇంగ్లీషు మాత్రమే వచ్చేది. కాబట్టే నేను వారిని ఒక్కొక్కరిగా పిలుచుకుని కొన్ని మాటల్లో సాధనను వివరించేవాడిని, వాళ్ళు సాధన చేస్తూ పురోగతి సాధించేవారు. ఎప్పుడైనా ఇంగ్లీషు భాషలో ఏదైనా పదం మాట్లాడలేకపోతే, దానిని సాధకుల నుంచే తెలుసుకుని అర్థం చేసుకునేవాడిని. కానీ ఒక సందర్భంలో నేను ఇంగ్లీషులో చెప్పిన విషయం తప్పుడు అర్థానికి దారితీసేదిగా మారింది. మైత్రీ రోజున మైత్రీ–కరుణల సాధన నేర్పిస్తూ "Today is the day to make love" అని చెప్పేశాను. ఇంగ్లీషు భాష సరిగ్గా రాకపోవటంతో దాని అర్థమేమిటో నాకు తెలియలేదు. పరిణామంగా ముగ్గురు హిప్పీ జంటలు ఒక చెట్టు క్రింద కామక్రీడలో నిమగ్నమైపోయారు. నేను వారిని చూసి మందలించినప్పుడు, "టుడే ఈజ్ లవ్ మేకింగ్ డే అని మీరే చెప్పారు కదా!" అని వాళ్ళు అన్నారు. మరి వారికి నేను ఏమని సమాధానం ఇవ్వగలను?

ఆ రోజుల్లో ఢిల్లీలో "సాధన" అనే విషయం పట్ల ఒక అంతర్జాతీయ సమ్మేళనం జరిగింది. అందులో పాల్గొన్న నా శిష్యుడైన సాధకుడు ఒకతను, "సాధనకు చెందిన అసలైన విద్యను నేర్చుకోవాలంటే శ్రీ గోయంకా గారి వద్దకు వెళ్ళండి. ఆయన బుద్ధుడు నేర్పించిన వైజ్ఞానిక విద్య అయిన విపశ్యన సాధనను నేర్పిస్తారు." అని చెప్పాడు. అది విని ఆ సంస్థ అధ్యక్షుడైన, అమెరికాకు చెందిన బాబా రామదాస్ బోధగయాలో ఏర్పాటైన శిబిరంలో పాల్గొన్నాడు. శిబిరంలో పాల్గొని ఆయనెంతో ప్రసన్నుడయ్యాడు. ఆయన మరికొన్ని శిబిరాల్లో పాల్గొని ఎంతో ప్రసన్నతతో స్వదేశానికి తిరిగి వెళ్ళాడు. ఆ తరువాత ఆయన శిష్యులు ఎంతోమంది శిబిరాలకు రావటం మొదలుపెట్టారు.

## ఇంగ్లీషులో మొదటి శిబిరం

వాళ్ళందరూ వాళ్ళ కొరకు డల్హౌజీలో ఒక శిబిరాన్ని ఇంగ్లీషులో నిర్వహించమని అభ్యర్థించసాగారు. కానీ ధారాళంగా ప్రవచనం ఇవ్వగలిగినంత గొప్ప ఇంగ్లీషు నాకు వచ్చేది కాదు. దానితో వాళ్ల కొరకు ప్రత్యేకంగా ఒక శిబిరాన్ని నిర్వహించటం అసంభవంగా అనిపించింది. వారిలో కొందరు "ఈ విద్య మయన్మార్ నుండి భారతదేశానికి వచ్చి అందరికీ అందుబాటులో ఉంది. కానీ ఈ వ్యక్తి భాష అనే నెపంతో మాకు ధర్మఫలాల్ని అందనివ్వట్లేదు." అని గురుదేవునికి ఉత్తరం రాశారు. గురుదేవులు నాకు ఫోన్ చేసి తిడుతూ, "శిబిరాలు నీవు కాదు, నేను నిర్వహిస్తున్నాను. నీవు వాళ్ళ మాట విని డల్హౌజీలో శిబిరం తీసుకో, ధర్మం సహాయం చేస్తుంది. నీవు చింతించవద్దు." అని చెప్పారు.

గురుదేవుని ఆజ్ఞను పాటిస్తూ, నేను శిబిరం నిర్వహించాను. డల్హౌజీలోని ఒక హోటల్‌లో ఇది వరకే హిందీలో ఒక శిబిరం నిర్వహించబడింది. అయితే ఇంగ్లీషులో మొదటి శిబిరం అదే. మొదటిరోజు అతి కష్టం మీద 15 నిమిషాల పాటు మాట్లాడగలిగాను. రెండవరోజు అరగంట వరకూ మాట్లాడాను. ఇక మూడవరోజు పూర్తిగా గంటసేపు ధారాళంగా ప్రవచనం ఇవ్వగలిగాను. ఏదైనా పదం దగ్గర తడబడితే, సాధకులు సహాయం చేసేవారు. శిబిరం చక్కగా పూర్తయింది. హిందీలో చెప్పినట్లుగానే ఇంగ్లీషులో కూడా ధారాళంగా చెప్పగలగటం నాకే ఆశ్చర్యంగా అనిపించింది, సాధకులు కూడా ఆశ్చర్యపోయారు. నిజంగానే అది నేను నిర్వహించిన శిబిరం కాదు. పూజ్య గురుదేవుల శిబిరమే, ధర్మం యొక్క శిబిరమే. నేనే అనవసరంగా సంకోచించేవాడిని. ఆ సంకోచం మొత్తం వెళ్లిపోయింది. అందరూ ఎంతగానో ప్రసన్నులయ్యారు. ఆ శిబిరం మా అందరికీ ఎంతగానో ఉపయోగకరమైనదిగా రుజువైంది.

## శిబిర ఖర్చుల గురించి కలిగిన అనుమానాలు:

ఆ రోజుల్లో విదేశీ హిప్పీలు పెద్ద సంఖ్యలో శిబిరాల్లో పాల్గొనేవారు. శిబిరాల ద్వారా ప్రయోజనం కలుగుతుంటే ఎవరు మాత్రం ఎందుకు రారు? అయితే విపశ్యన విద్య యొక్క ఒకానొక నియమం ఏమిటంటే, నేర్పించే వారు కూడా వారి సాధారణ ఖర్చులకు కూడా సాధకుల నుండి డబ్బు తీసుకోరాదు. అంతేకాదు, అతడే ఎంతో కొంత దానమిస్తాడు. దానితో ఒకవైపు సాధకుల సంఖ్య అయితే పెరుగుతూ పోయింది, మరోవైపు "బోధించే వ్యక్తి కూడా తన ఖర్చులు తనే భరించాలి. మరి శిబిరాలకు కావలసిన డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? ఏదైనా విదేశీ సంస్థ ఈ ఖర్చుల్ని భరిస్తుందేమో." అనే సందేహాలు కొందరిలో తలెత్తాయి. ప్రత్యేకించి, నేను సాధన అనే పేరుతో ప్రజలచేత మత మార్పిడి చేయించి వాళ్లను బౌద్ధులుగా తయారుచేయటంలో నిమగ్నమై ఉన్నానేమో అనే అనుమానం క్రైస్తవ నాయకులకు కలిగింది. దానిని పరీక్షించటానికి అమృత్‌సర్‌లోని క్రైస్తవ మిషనరీకి చెందిన ముగ్గురు ప్రముఖ నాయకులు డల్హౌజీలో నన్ను కలవటానికి వచ్చారు. అదేరోజు శిబిరం మొదలవుతున్నది. వారితో నేను, "ఊరికే మాట్లాడితే ఏదీ అర్థం కాదు. ఇప్పుడు ఇక్కడి వరకూ వచ్చారు కాబట్టి పది రోజులపాటు శిబిరంలో కుర్చుని నేనేమి చేస్తానో, ఏమి నేర్పిస్తానో స్వయంగా పరీక్షించి చూడండి." అని చెప్పాను. ముగ్గురూ శిబిరంలో కూర్చున్నారు. నా బోధనలోని ఒక నియమం ఏమిటంటే, నా ప్రవచనంలో ప్రతి సంప్రదాయపు గురువుల్లోని మంచి విషయాలను వివరిస్తాను. ఈ ఆనవాయితీ ప్రకారంగానే, ఏసుక్రీస్తులోని గుణాలను చర్చిస్తూ వారి ప్రేమ, కరుణలను గురించి ప్రస్తావించాను. శిబిరం పూర్తయ్యాక, ఆ ముగ్గురిలో ఒకరైన సుపీరియర్ మదర్ మేరీ, "Goenka! you are teaching Chiristianity in the name of the Buddha." అని చెప్పారు. అంటే, "గోయంకా! మీరు బుద్ధుని పేరుతో క్రైస్తవాన్ని నేర్పిస్తున్నారు" అని. ఇక నాలో ఎటువంటి దురుద్దేశ్యమూ లేదు, నేను సంప్రదాయాన్ని నెలకొల్పను, అందరికీ వర్తించే ధర్మాన్నే నెలకొల్పుతాను. అనే విషయం వ్యాపించటం మొదలయింది.

ఈ క్రైస్తవ సంస్థ యొక్క సందేహమైతే దూరమైంది. కానీ మరొక సమస్య తలెత్తింది. అదేమిటంటే, నేను ఏదో విదేశీ సంస్థ తరపున శిబిరాలు నిర్వహించే పని చేస్తున్నాను అని భారత ప్రభుత్వానికి అనిపించింది. తన సందేహాలను నివృత్తి చేసుకోవటానికి వారి గూఢాచారులను శిబిరాలకు పంపించారు. వాళ్ళలో ఒకరు, "మీ మీద గూఢచర్యం చేయటానికి మమ్మల్ని పంపించారు. కానీ మాకైతే ఇందులో ఎటువంటి లోపమూ అగుపించలేదు, ఏదో విదేశీ హస్తం ఉన్నట్లుగా కూడా కనిపించలేదు." అనే సత్యాన్ని నా ముందు వ్యక్తపరిచాడు. అయినప్పటికీ నా పట్ల ప్రభుత్వం వారి నిఘా మాత్రం చాలాకాలంగా కొనసాగింది.

## పాస్‌పోర్ట్ మరియు పౌరసత్వం:

ఈ క్రమంలోనే మరొక ఘటన జరిగింది. ఇంత పెద్ద సంఖ్యలో విదేశీ హిప్పీలు శిబిరాల్లో పాల్గొంటూ ఉండటంతో, భారతదేశానికి రాలేని వారి తల్లిదండ్రులు, మిత్రులు, పరిచయస్తులు శిబిరాల్లో పాల్గొని ప్రయోజనం పొందటానికి వాళ్ళ దేశాలకే వెళ్లి శిబిరాలు నిర్వహించమని నన్ను అభ్యర్థించారు. గురుదేవులు చెప్పినట్లు ధర్మం భారతదేశంలోనే కాకుండా విశ్వమంతటా వ్యాప్తి చెందుతుంది. కాబట్టే ఫ్రాన్స్‌లో శిబిరం నిశ్చయమైంది. కానీ బర్మా ప్రభుత్వపు నియమాలననుసరించి నా పాస్‌పోర్ట్‌తో ఏదో ఒక దేశాన్ని సందర్శించటానికి మత్రమే అనుమతి ఉండేది. మా అమ్మ కొరకు నేను భారతదేశానికి వచ్చాను. కాబట్టి కేవలం భారతదేశాన్ని సందర్శించటానికే నాకు అనుమతి ఉండేది. దానిమీద మరో దేశానికి వెళ్ళే అనుమతి లేదు. అప్పుడు నా ముందు ఒకటే మార్గమున్నది. అదేమిటంటే, నేను బర్మా పౌరసత్వాన్ని వదిలి భారతదేశ పౌరసత్వాన్ని తీసుకుంటే, ప్రపంచంలోని ఏ దేశాన్ని అయినా సందర్శించే వీలు కలుగుతుంది. అయితే భారతదేశానికి నా కార్యకలాపాల మీద అనుమానం ఉంది. వాళ్ళ గూఢాచారులు నా వద్దకు వస్తూ, వాళ్ళ రిపోర్టులు ఇస్తూ ఉండేవారు. వాళ్ళలో ఒకరైతే "మీ మీద ప్రభుత్వానికి అనుమానం ఉంది." అని నాతో స్పష్టంగా చెప్పారు. అందుకే ఆ కేసు మూతపడలేదు, నడుస్తూనే ఉన్నది. అంటే, నాకు భారతీయ పౌరసత్వం లభించటం కూడా కష్టమైపోయింది. నాకు భారతీయ పాస్‌పోర్ట్ వస్తేనే నేను విదేశీయాత్ర చేయగలను.

ఇంతలో యాదృచ్ఛికంగా, శ్రీ మురార్జీ దేశాయ్ భారత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, నా బంధువు ఒకతను ఆయనను కలవటానికి వెళ్ళాడు. నా పాస్‌పోర్టు గురించి ప్రస్తావనకు వచ్చినప్పుడు శ్రీ మురార్జీ గారు, "ఇంకా తనిఖీ నడుస్తోంది, కాబట్టి ఇప్పుడే పౌరసత్వాన్ని ఇవ్వలేము." అని చెప్పారు. మురార్జీ గారికి మిత్రుడైన నా బంధువు, "నేను ఇతడిని తనిఖీ చేయకపోతే, మా మేనకోడలిని

ఆయన ఇంటికి కోడలిగా పంపించేవాడిని కాదు కదా." అని చెప్పాడు. అది విన్న శ్రీ మురార్జీ దేశాయ్ ఆశ్చర్యపోయి, వెంటనే పౌరసత్వం ఇవ్వమని ఆదేశాలు జారిచేశారు.

## ఫ్రాన్స్‌లో మొదటి శిబిరం:

నాకు భారతీయ పౌరసత్వం లభించింది. ఫ్రాన్స్‌లో నిశ్చయమైన మొదటి శిబిరం కంటే ముందుగానే వీసా కూడా మంజూరయింది. నేను అక్కడకు వెళ్లి రెండు శిబిరాలు నిర్వహించాను. ఆ తరువాత యూ.కే.లో రెండు శిబిరాలు మరియు కెనడాలోని మాంట్రియేల్‌లో ఒక శిబిరం నిర్వహింపబడ్డాయి.

అయితే ఇంతలో మరొక ఆటంకం తలెత్తింది. బర్మా ప్రభుత్వ నియమం ప్రకారం, ఎవరైనా వ్యక్తి తన పౌరసత్వాన్ని మార్చుకుంటే, ఆ వ్యక్తి దేశద్రోహి అవుతాడు. అట్టి వ్యక్తికి మయన్మార్‌కు వెళ్ళటానికి వీసా ఇవ్వరు. ట్రాన్సిట్ వీసా కూడా ఇవ్వరు. భారతీయ పౌరసత్వం లభించటంతో విదేశాలకు వెళ్ళే సౌకర్యమైతే కలిగింది కానీ నా మాతృభూమికి తిరిగి వెళ్ళలేకపోయాను. అయితే ఈ విషయం నన్ను అంతగా బాధించలేదు. ఎందుకంటే, ఏ ఉద్దేశ్యంతో అయితే నేను బయటకు వచ్చానో, అది పూర్తవుతోంది, అదే సంతోషకర విషయం.

## అమెరికాలో మొదటి శిబిరం:

అమెరికాలో మొదటి శిబిరం నిర్వహించబడింది. అయితే శిబిరంలో పాల్గొన్న వారి నుండి డబ్బు వసూలు చేయబడింది అని శిబిరం మొదలయ్యాక తెలిసింది. దానితో నేను "ఇక తరువాతి శిబిరాలన్నీ రద్దు చేద్దాము. శిబిరాలు నిర్వహించటానికి తగినంత డబ్బు మీ వద్ద లేనంత వరకూ ఎటువంటి శిబిరమూ జరగదు." అని వాళ్ళతో చెప్పాను. అది విన్న అక్కడి కు.కేట్ ప్రాట్ అనే మహిళ, పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వటానికి ముందుకు వచ్చి, "ఇది నేను ఇస్తున్న దానము. దీనికి బదులుగా నాకు ఏమీ వద్దు." అని చెప్పింది. ఆ తరువాత అక్కడి శిబిరాలనన్నింటినీ నిర్వహించటం సులభమైపోయింది. శిబిరం పూర్తయ్యాక వచ్చిన దానాన్ని తరువాతి శిబిరాల కొరకు ప్రోగు చేసేవారు. ఈ విధంగా విదేశాల్లో కూడా ఎటువంటి డబ్బు తీసుకోకుండా శిబిరాలు నిర్వహించే పని సులభమైపోయి శిబిరాలన్నీ విజయవంతంగా నడుస్తూపోయాయి.

## నా గురించి తలెత్తిన వదంతి:

నేను ప్రపంచంలోని వేర్వేరు దేశాలు తిరుగుతూ శిబిరాలు నిర్వహిస్తూ ఉండేవాడిని. ఇంతలో ఒక అప్రియ ప్రసంగం వచ్చింది. ఈ క్రమంలో, గురుదేవులకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఒకరు నాపట్ల దుష్ప్రచారానికి పాల్పడటం జరిగింది. గురుదేవుల ఆశీస్సులు నాపై నుండి తొలగిపోయాయని, ఇక గురుదేవులు నాకు తన ఆశీస్సులు అందించరని ప్రచారం జరిగింది. ఇది పెద్ద దుమారానికి కారణమయింది. నేను సాధకులకు ఏమని సర్దిచెప్పగలను? నేను యే సాధకురాలి ఇంట్లోనయితే బస చేశానో, ఆమె నాపట్ల దుష్ప్రచారానికి కారణమైన వ్యక్తి పట్ల అత్యంత భక్తిభావన కలిగి ఉండేది. ఆమెకు కూడా, నన్ను ధర్మకార్యకలాపాల నుండి తొలగించారేమో, కాబట్టే గురుదేవుల ఆశీస్సులు నాకు దూరం అయి ఉండవచ్చు. ఇక నా శిబిరాలు ఎలా సఫలం అవుతాయి? అనే అభిప్రాయానికి వచ్చింది.

ఆ మరుసటి రోజే శిబిరం మొదలుకావాల్సి ఉన్నది. దానితో ఆవిడ, "ఇక్కడికి ఎలాగూ వచ్చేశాం కాబట్టి శిబిరాన్ని నిర్వహిద్దాం." అని చెప్పింది. శిబిరం నిర్వహింపబడింది, అది ఎంతో విజయవంతమైనట్లుగా అందరికీ అనిపించింది. అందరూ ఎంతో ప్రసన్నులయ్యారు. ఆ వదంతి అబద్ధంగా రుజువైంది, దానిని వ్యాపింప చేసిన వ్యక్తి నోటికి తాళం పడింది. గురుదేవుని ఆశీర్వాదం ఎప్పటికీ నాతోనే ఉన్నది, ఇప్పుడు కూడా ఉంది. ఆటంకాలు వస్తూ తొలగిపోతూపోయాయి. అది గురుదేవుని కృపనే. ఆ తరువాత అన్ని శిబిరాలూ విజయవంతంగా సంపన్నమవుతూపోయాయి. ప్రపంచంలో ఎక్కడెక్కడ శిబిరాలు నిర్వహింపబడినా అన్నీ అత్యంత విజయవంతమయ్యాయి. ఎక్కడా ఎటువంటి ఆటంకమూ కలగలేదు.

– తరువాయి భాగం వచ్చే సంచికలో

రెండు సంవత్సరాలకు చందా రూ 100/- **విపశ్యన తెలుగు మాసపత్రిక** జీవిత చందా రూ. 500/-

ప్రచురణ తేది: ప్రతినెల 30/31 పోష్టింగ్ తేది: ప్రతి నెల 1/2 వెల: రూ 5/-

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.